క్లుప్తంగా

శ్రీతిరుపతమ్మ ఆలయంలో కంకణ సేవ



కంకణసేవా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయంలో శుక్రవారం గ్రామానికి చెందిన సేవా సమితి మహిళలు కంకణ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు అందించే కంకణాలు తయారు చేసే సేవా కార్యక్రమం మూడు రోజుల పాటు సాగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

పేరకలపాడు, పెండ్యాలలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు



పేరకలపాడు గ్రామ సచివాలయంలో ఆధార్ కార్డులో తేడాలను సరిచేస్తున్న సిబ్బంది

కంచికచర్ల: మండలంలోని పేరకలపాడు, పెండ్యాల గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహించామని ఎంపీడీఓ కె.శిల్ప శుక్రవారం తెలిపారు. శిబిరంలో చిన్న పిల్లలకు కొత్త ఆధార్ నమోదు చేయటం, చిరునామాలో మార్పులున్నట్లయితే సరిచేయటం, ఆధార్ నంబర్‌కు ఫోన్ నంబర్ లింక్ చేయటం, పుట్టిన తేదీల్లో తప్పొప్పులను సరిచేయటం, బయో మెట్రిక్‌లో వేలిముద్రలు పడనివారికి తిరిగి అప్‌డేట్ చేయటం వంటివి చేస్తారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న విప్ ఉదయభాను

మక్కపేట(పెనుగంచిప్రోలు): వత్సవాయి మండలం మక్కపేట గ్రామానికి చెందిన గుగులోతు అజయ్(25) శుక్రవారం తెల్లవారుజామున తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కొండబోలు బ్రహ్మం, శ్రీతిరుపమ్మ ఆలయ డైరెక్టర్ కట్టా మాధవి, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, ఆలయ మాజీ చైర్మన్ లగడపాటి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు కనగాల రమేష్, భాస్కరరావు, కేవీఎన్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు బహిరంగ ప్రజావేదిక

పెనుగంచిప్రోలు: మండలంలోని 15 గ్రామాల్లో 2020–21, 2021–22 ఏడాది మధ్య జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, పింఛన్ల పంపిణీ, పీఆర్ పనులు, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఎస్ఏ పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ పూర్తయిందని ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు మండల స్థాయిలో బహిరంగ ప్రజావేదిక నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రజావేదికకు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలన్నారు.

ప్రత్యేక బస్సుల ద్వారా రూ.6లక్షల ఆదాయం

నందిగామ: సంక్రాంతి పండుగ సందర్భంగా జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో నుంచి ఏర్పాటుచేసిన ప్రత్యేక బస్సుల ద్వారా అధిక ఆదాయం సమకూరిందని డిపో మేనేజర్ ఎంవీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ సమయంలో మొత్తం 34 స్పెషల్ బస్సులు వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేశాయన్నారు. ప్రత్యేక బస్సులను వారం రోజుల పాటు వివిధ రూట్లలో నడిపామని, వాటి ద్వారా రూ.6లక్షల ఆదాయం డిపోకు అదనంగా సమకూరినట్లు వివరించారు.

చదువుతో సవాళ్లను అధిగమించొచ్చు

అల్లూరు(వీరులపాడు): ఉన్నత చదువులు చదివితే ఎటువంటి సవాళ్లనైనా అధిగమించవచ్చని సీడీపీవో లక్ష్మీభార్గవి అన్నారు. బాలికా దినోత్సవం సందర్భంగా మండలంలోని అల్లూరు గ్రామంలో లింగ వివక్షపై కిశోర బాలికలు, తల్లిదండ్రులకు శుక్రవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు వాటిని అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా అవిద్య, అనాదరణ, లింగ వివక్ష వంటి వాటిని అధిగమించి ముందుకు సాగాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు ప్రభావతి, స్పందన, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలి
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను
- పేట పట్టణ, నియోజకవర్గ ముఖ్య నాయకులు, జేసీఎస్ సభ్యుల సమావేశం



సచివాలయ కన్వీనర్లకు బాధ్యతలు అప్పగిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, వేదికపై హనుమయ్య, తన్నీరు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: 2024లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ వీర సైనికుల్లా పనిచేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పిలుపునిచ్చారు. స్థానిక చిల్లకల్లు రోడ్డులోని శుభమస్తు కల్యాణమండపంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, నూతనంగా నియమించిన సచివాలయ కన్వీనర్లతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఉదయభాను పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పని చేస్తూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎక్కడా అవినీతి జరగకుండా పారదర్శక పాలన అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతి సీఎం జగనన్నతోనే సాధ్యమన్నారు. సీఎం వైఎస్ జగన్ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీల్లో 99.4 శాతం నెరవేర్చి చరిత్ర సృష్టించారన్నారు. . పార్టీని గెలిపించుకొని మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పార్టీపై అంకిత భావంతో పనిచేసే వారినే వలంటీర్లకు అనుబంధంగా గృహసారథులుగా నియమించాలన్నారు. పేట పట్టణ సచివాలయాల కన్వీనర్‌గా తుమ్మేపల్లి నరేంద్ర, పేట మండల కన్వీనర్‌గా దొంగల జానకీరామయ్య, వత్సవాయి మండలానికి చింతకుంట్ల వెంకటరెడ్డి, పెనుగంచిప్రోలు మండలానికి కన్నమాల శామ్యూల్, నందిగామ మండలంలోని ఏటిపట్టు గ్రామాలకు దేవినేని నాగేశ్వరరావును కన్వీనర్లుగా నియమించినట్లు తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థలు ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసలు అందుకున్నాయని ఉదయభాను అన్నారు. పలు రాష్ట్రాలు ఏపీని ఆదర్శంగా తీసుకోవాలని సూచించడం మనకు గర్వకారణమన్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

నియోజకవర్గ పరిశీలకుడు నూతలపాటి హనుమయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ ఆదేశాల మేరకు నియమితులైన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పార్టీ బలోపేతానికి కృషిచేయాలని తెలిపారు. పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు, వలంటీర్లతో నూతన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలన్నారు. తద్వారా అక్కడ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇక్కడ ఉదయభానులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణప్రసాద్, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పేట పట్టణ, మండల అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్, చిలుకూరి శ్రీనివాస్, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల అధ్యక్షులు గాదెల రామారావు, ఊట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, ఎంపీపీ మార్కపూడి గాంధీ, వైఎస్సార్ సీపీ నాయకుడు వేల్పుల రవికుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీల అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణంలో ప్రధాన రహదారుల అభివృద్ధి

- గాంధీ సెంటర్–చందాపురం బైపాస్ రోడ్డు విస్తరణ
- పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



రోడ్డు నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: పట్టణంలోని సీఎం రోడ్డు మాదిరిగా జాతీయ రహదారిని అనుసంధానం చేసే అన్ని ప్రధాన రహదారులను విస్తరించి అబివృద్ధి చేయనున్నట్లు శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. గాంధీ సెంటరు నుంచి చందర్లపాడు బైపాస్ రోడ్డు వరకు చేపడుతున్న విస్తరణ, రహదారి నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవ నందిగామ నిర్మాణమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నందిగామ పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి పాలన సాగిస్తున్నారని గుర్తు చేశారు. ఏది కావాలన్నా అడగ్గానే మంజూరు చేస్తున్నారని తెలిపారు. అనంతరం పట్టణంలోని 12వ వార్డు పరిధిలోని అయ్యప్ప స్వామి వారి ఆలయం ఎదురు రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, నగర పంచాయతీ కమిషనర్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్‌లు మాడుగుల నాగరత్నం, ఓర్సు లక్ష్మి, వార్డు కన్వీనర్ కోమటి రవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు పాములపాటి రమేష్, పాకాలపాటి కిరణ్, సాంబయ్య, యాకూబ్ వలి, నల్లమల్లి మురళి, వీసం దుర్గారావు, ఎండీ అమీన్, ఫాతిమా, కృపారావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలి



డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ జయరాం

నందిగామ: పట్టణవాసులు ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పారిశుద్ధ్య సిబ్బంది వచ్చిన సమయంలో మాత్రమే చెత్తను అందజేయాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. పట్టణంలోని ఆరవ వార్డు పరిధిలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముఖ్యంగా డ్రైనేజీలలో వ్యర్థాలు వేయడం వలన పారిశుద్ధ్య సమస్య ఏర్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలన్నారు. పట్టణ పరిధిలో ప్రత్యేక పరిస్థితి డ్రైవ్ జరుగుతోందని ప్రజలందరి సహకారంతో పారిశుద్ధ్య పరిస్థితి మరింత మెరుగుపరుచుకుందామన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ యాకూబ్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురునాథం తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడపడం నిషిద్ధం

ఆర్టీవో పద్మావతి



కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీవో పద్మావతి

నందిగామ: మైనర్లు వాహనాలు నడపకూడదని ఆర్టీవో ఎం.పద్మావతి అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ ఇటీవల జరుగుతున్న ప్రమాదాలలో ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలే ఉంటున్నాయని, అవి కూడా యువకులు నడిపే వాహనాలే ఎక్కువగా ప్రమాదాల పాలవుతున్నాయన్నారు. యువకులు లైసెన్స్ లేకుండా వాహనాలను నడపకూడదని, ముఖ్యంగా వాహనాలు నడిపే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు ఉండాలని, నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ కూడా ధరించాలన్నారు. రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ రాజు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరనిలోటు

ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు



కంచికచర్లలో శ్రీనివాసరావు భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: కంచికచర్ల గ్రామ పంచాయతీ ఏడవ వార్డు సభ్యురాలు వంగా కామేశ్వరి భర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీనివాసరావు(52) శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు శ్రీనివాసరావు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ శ్రీనివాసరావు కుటుంబసభ్యులకు ఫోన్‌చేసి పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కంచికచర్లలో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శ్రీనివాసరావు ప్రతి రోజూ పాల్గొని తనతో పాటు ఇంటింటికీ తిరిగేవారని గుర్తుచేసుకున్నారు. శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. పరామర్శించిన వారిలో సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు, మండల పార్టీ కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, ఎంపీటీసీ సభ్యురాలు వేమా రోజారమణి, ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్ మాడుగుల శంకర్, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు వేల్పుల శ్రీనివాసరావు, నంబూరు పెదబాబు, కాలవ వాసుదేవరావు తదితరులు ఉన్నారు.

పేట తహసీల్దార్‌కు డెప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి



నాగేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మండల తహసీల్దార్ కె.నాగేశ్వరరావుకు డెప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఆయన్ను స్పెషల్ డెప్యూటీ కలెక్టర్, ఎస్టీ కార్పొరేషన్ (ట్రైబల్ వెల్ఫేర్), ఏలూరుకు బదిలీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బందికి ఆయనకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రత్యేకంగా అభినందించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మానవహారంలో పాల్గొన్న విద్యార్థులతో అంగన్‌వాడీ కార్యకర్తలు

భీమవరం(పెనుగంచిప్రోలు): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీఓ గ్లోరి తెలిపారు. వత్సవాయి మండలం భీమవరం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. బాలికలకు 1098 చైల్డ్ హెల్ప్, 100 డయల్, 181 ఉమెన్ హెల్ప్‌లైన్ గురించి వివరించారు. బాల్య వివాహాలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన సువార్త స్వస్థత మహాసభలు

నందిగామ: పట్టణంలోని మధిర రోడ్డు సమీపంలో గల అయ్యదేవర కాళేశ్వరరావు ట్రస్ట్ ప్రాంగణంలో ఇమ్మానుయేల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సువార్త స్వస్థత మహాసభలు శుక్రవారం రాత్రి ముగిశాయి. చివరి రోజు పలువురు సువార్తీకులు పాల్గొని వాక్యోపదేశం చేశారు. అనంతరం స్వస్థత ప్రార్థనలు నిర్వహించారు. రాత్రి పొద్దుపోయేవరకు జరిగిన ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నూరు శాతం పని దినాలు కల్పించాలి



ఉపాధి హామీ పథకం పనులను పరిశీలిస్తున్న పీడీ సునీత

అల్లూరు(వీరులపాడు): జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ నూరు శాతం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సునీత అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఉందన్నారు. ముఖ్యంగా చేస్తున్న పనుల కొలతల్లో తేడాలు లేకుండా చూడాలని ఆమె ఆదేశించారు. పని తీరుపై ఫిర్యాదులు వచ్చినా అవకతవకలకు పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ మణికుమార్, సర్పంచ్ బండెల రాణి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, పీఏసీఎస్ చైర్మన్ కోటేరు విజయభాస్కర్‌రెడ్డి, ఏపీఎం జనార్దన్, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో విద్యార్థుల ప్రతిభ

మైలవరం: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు డి. సీతయ్య, బి. రిషినాయక్ ఫాయల్ విభాగంలో ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం. శ్రీరామమూర్తి తెలిపారు. మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 18, 19 తేదీలలో నంద్యాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన అండర్–19 ఫెన్సింగ్ రాష్ట్ర స్థాయి పోటీలలో తమ కళాశాల విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

లకిరెడ్డి విద్యార్థులకు కాంస్య పతకాలు

అండర్ 19 ఫెన్సింగ్ రాష్ట్ర స్థాయి పోటీలలో లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం. గంగాధర్, యు. అజయ్‌కుమార్, టి. సాయికృష్ణ, ఎస్. ఈశ్వర్ చైతన్య, పి. హరిచరణ్ కాంస్య పతకాలు సాధించినట్టు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు డి.రామ్‌ప్రసాదరావు తెలిపారు.

డ్రైవర్లకు ఉచిత వైద్య పరీక్షలు

జగ్గయ్యపేట అర్బన్: జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక మోటార్ వెహికిల్ ఆఫీసు వద్ద డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో డ్రైవర్లకు రక్త పరీక్షలు, కంటి చూపు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎంవీఐ రవికుమార్ మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్క డ్రైవర్ కంటిని, ఆరోగ్యాన్ని సురక్షితంగా ఉంచుకోవాలని, మద్యం తాగి వాహనాలను నడపరాదని తెలిపారు. సురక్షితమైన ప్రయాణం కోసం, ఆరోగ్యాలను కాపాడుకోవడం కోసం ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించుకుంటూ ఉండాలని సూచించారు. అనంతరం రోడ్డు భద్రత గురించి తపోవన్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మోటార్ వెహికిల్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ మహ్మద్ ఆలాం, కానిస్టేబుళ్లు ఎస్.వెంకటేశ్వరరావు, సీహెచ్.శరత్‌చంద్ర, హోంగార్డు సువర్ణరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ టెన్నిస్ టోర్నీలో సత్తా చాటిన ఇషాన్



విజయవాడ స్పోర్ట్స్:ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్(ఏఐటీఏ) అండర్–14 జాతీయ ర్యాంకింగ్ టోర్నీలో విజయవాడ క్రీడాకారుడు వై.ఇషాన్ సత్తా చాటాడు. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు ఢిల్లీలో జరిగిన పోటీల్లో ఆంధ్ర రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి సింగిల్స్, డబుల్స్ టైటిల్స్‌ను కైవసం చేసుకున్నాడు. సింగిల్స్‌లో ఢిల్లీ క్రీడాకారుడు లోయ టెపియాల్‌ను 6–1, 6–1 తేడాతో ఓడించి టైటిల్‌ను, డబుల్స్‌లో మన్నం రాయ్ (అహ్మదాబాద్)తో జత కట్టి ఆయాన్ (ఢిల్లీ), లోయ (ఢిల్లీ) జోడిని 10–6 తేడాతో ఓడించి టైటిల్‌ను సాధించాడు.

విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ శిబిరం

జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడి ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలకు ఆధార్ నమోదు తప్పనిసరి చేశారన్నారు. గతంలో ఆధార్ కార్డు కలిగిన విద్యార్థులు తప్పని సరిగా అప్‌డేట్ చేసుకుని ప్రభుత్వం అందించే పథకాలు పొందాలన్నారు. అనంతరం 44మంది విద్యార్థులకు గాను తొలిరోజు 29మందికి ఆధార్ అప్‌డేట్ చేశారు. హెచ్ఎం రెడ్‌స్టార్, ఉపాధ్యాయురాలు వాసంతి, సీఆర్పీ నాగేశ్వరరావు డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సహకారం అందిస్తాం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విశ్రాంత ఉద్యోగులకు అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ జమల పూర్ణమ్మ తెలిపారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో శుక్రవారం విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమలపూర్ణమ్మ, సంస్థ కార్యదర్శి వి.రవి కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు, ఇతర సదుపాయాల విషయంలో పూర్తి సహకారం అందిస్తామన్నారు. సంస్థ కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు సకాలంలో లైవ్ సర్టిఫికెట్స్ ఆఫీసుకు అందచేసి పెన్షన్ పొందాలని కోరారు. ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు. రిటైర్డ్ ఉద్యోగుల ప్రతినిధి టి.బోడిస్వామి, నారాయణ, గొంది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు నటరాజ రామకృష్ణ స్ఫూర్తి

ఏపీ ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు



పురస్కార గ్రహీతలతో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్):ఎంతో మందిని కళాకారులుగా తీర్చిదిద్దిన నటరాజ రామకృష్ణ స్ఫూర్తితో ముందుకు సాగాలని ఎమ్మెల్యే, ఏపీ ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు అన్నారు. దుర్గాపురం ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో శుక్రవారం సాయంత్రం కళావిపంచి, శారద కళాసమితి సంయుక్త ఆధ్వర్యాన శ్రీనటరాజ రామకృష్ణ స్మారక పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డితో కలిసి భాగవతుల సేతురామ్, కథక్ అంజుబాబు, శారదా రామకృష్ణలకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నటరాజ రామకృష్ణ జయంతి ఉత్సవాల్లో భాగంగా స్మారక పురస్కారాలు తన చేతుల మీదుగా అందజేయటం ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ భారత కళాప్రపూర్ణ నటరాజ రామకృష్ణ ప్రతి ఒక్కరి హృదయాల్లో ఎన్నటికీ నిలిచే ఉంటారన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. పురస్కార గ్రహీతలు భాగవతుల సేతురామ్, కథక్ అంజుబాబు, శారదా రామకృష్ణ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్ఠాత్మకమైన పురస్కారాలు రావటంతో తమపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. సభాధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, శారద కళాసమితి అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు మాట్లాడారు. పీఎంకే గాంధీ, అక్కినేని ఉమా వాఖ్యానం చేశారు. తొలుత పలువురు కళాకారులు చేసిన నృత్యాలు రంజింప చేశాయి.